క్లుప్తంగా

నేడు బాల పేరంటాలమ్మ ఆలయంలో అన్నసంతర్పణ

రామవరప్పాడు: విజయవాడ రూరల్ మండలం ప్రసాదంపాడులోని శ్రీ బాల పేరంటాలమ్మ ఆలయంలో శుక్రవారం అన్నసంతర్పణ నిర్వహిస్తున్నట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు. ఈ నెల 24, 25 తేదీల్లో రామవరప్పాడు, ప్రసాదంపాడు గ్రామాల్లో అమ్మవారి గ్రామోత్సవాన్ని కనుల పండువగా నిర్వహించారు. ఈ సందర్భంగా రామవరప్పాడు శ్రీ వెంకమ్మ పేరంటాలమ్మ ఆలయం తరుపున ఆలయ చైర్మన్ బోయిన భాను ప్రదీప్, ఈఓ పి.లోకేశ్వరిలు అమ్మవారికి పసుపు, కుంకుమ సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని పురస్కరించుకుని పలు గ్రామాల భక్తులు అమ్మవారి గ్రామోత్సవం అనుసరించి తీర్థప్రసాదాలు అందుకున్నారు. బాల పేరంటాలమ్మ గ్రామోత్సవాలు ముగియడంతో శుక్రవారం ఆలయం వద్ద అన్నసంతర్పణ కార్యక్రమం జరుగుతుందని చెప్పారు.

చేతి వేలు కొరికిన ఘటనపై కేసు నమోదు

పెనమలూరు: కానూరు వద్ద బైక్‌పై వెళ్తున్న ఇద్దరు వ్యక్తులు ఆటోకు అడ్డుగా వచ్చారని వారిపై ఆటోలో ఉన్న వారు దాడి చేసి చేతివేలు కొరకటంతో పోలీసులు గురువారం కేసు నమోదు చేశారు. గంగూరు గ్రామానికి చెందిన మట్టా వినోద్, మట్టా విజయ్ సోదరులు. వీరు బుధవారం విజయవాడలో షాపింగ్ చేసి బైక్‌పై గంగూరుకు బయలుదేరారు. వారు కానూరు ట్రెండ్‌సెట్ వద్దకు రాగా వెనుక నుంచి వచ్చిన ఆటోకు బైక్ తగిలింది. దీంతో ఆటోలో ఉన్న కానూరుకు చెందిన దుర్గాప్రసాద్, శ్రీనివాసరావులు బైక్‌పై ఉన్న వినోద్, విజయ్‌తో గొడవకు దిగారు. ఇది ఘర్షణకు దారి తీయటంతో వినోద్, విజయ్‌పై దాడి చేశారు. విజయ చేతి వేలు కొరికారు. ఈ ఘటనపై బాధితుడు ఇచ్చిన ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేశారు.

కానూరులో అన్నసమారాధన



పెనమలూరు: కానూరులో శ్రీగోపయ్య సమేత శ్రీ తిరుపతమ్మవారి ఆలయంలో గురువారం భక్తులను అన్నసమారాధన కార్యక్రమం నిర్వహించారు. గ్రామంలో శ్రీతిరుపతమ్మ అమ్మవారి ఆలయం పునఃనిర్మాణం చేసి విగ్రహ ప్రతిష్ఠ ఈ నెల 22వ తేదీన చేపట్టారు. ఈ సందర్భంగా అమ్మవారి ఆలయం వద్ద గురువారం భక్తులను అన్నసమారాధన కార్యక్రమం నిర్వహించారు. దాదాపు 10 వేల మంది భక్తులు అన్నసమారాధనలో పాల్గొన్నారు. కార్యక్రమంలో గ్రామ మాజీ సర్పంచ్ దేవభక్తుని సుబ్బారావు, కమ్మ కార్పొరేషన్ చైర్మన్ దేవభక్తుని చక్రవర్తి, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

నున్నలో వాహనాల చెక్‌పోస్ట్ ఏర్పాటు



నున్న(విజయవాడరూరల్): సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో నున్న గ్రామం పవర్‌గ్రిడ్ వద్ద వాహనాల చెక్ పోస్ట్‌ను గురువారం ఏర్పాటు చేశారు. విజయవాడ నగర పోలీస్ కమిషనర్ కాంతి రాణా టాటా సూచనల మేరకు రామచంద్రపాలెం అడ్డరోడ్డు వద్ద ఏర్పాటు చేసిన చెక్‌పోస్ట్‌ను నున్న పవర్ గ్రిడ్ వద్దకు మార్పు చేశారు. అనంతరం పోలీసు అధికారులు వాహనాలను ముమ్మరంగా తనిఖీ చేశారు.

ఆర్సీఎం చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు



హనుమాన్‌జంక్షన్‌రూరల్: స్థానిక గుడివాడరోడ్డులోని జ్యోతినగర్ ఆర్సీఎం చర్చిలో పవిత్ర గురువారాన్ని పురస్కరించుకుని ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. గుడ్ ఫ్రైడే ముందు రోజున ఏసుక్రీస్తు తన 12 మంది శిష్యులతో కలిసి నిర్వహించిన విందు భోజనాన్ని 'ది లాస్ట్ సప్పర్'గా పేర్కొంటారని ఫాదర్ జోసఫ్ తంబి పేర్కొన్నారు. ఈ విందుకు ముందుగా ఏసు క్రీస్తు తన శిష్యుల పాదాలను కడిగిన సాదృశ్యానికి అనుగుణంగా క్రీస్తు మాలాధరణ స్వీకరించిన భక్తులకు ఫాదర్ జోసఫ్ తంబి పాదాలు కడిగి, దివ్య బలిపూజ నిర్వహించారు.

31లోగా పన్ను బకాయిలను చెల్లించండి

భవానీపురం(విజయవాడపశ్చిమ): నగరపాలక సంస్థకు చెల్లించాల్సిన ఇంటి, ఖాళీ స్థలాల పన్ను బకాయిలకు వడ్డీ మాఫీ కాలపరిమితి ఈ నెల 31తో ముగుస్తున్న నేపథ్యంలో పన్ను బకాయిలను వెంటనే చెల్లించాలని నగరపాలక సంస్థ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

సచివాలయాలతో గ్రామ స్వరాజ్యం

- ప్రజలకు చేరువగా సేవలు
- సచివాలయాలకు సమకూరిన సొంత భవనాలు
- మెరుగైన సేవలు అందేలా ప్రభుత్వం చర్యలు



పునాదిపాడులో అందుబాటులోకి వచ్చిన నూతన సచివాలయ భవనం



కానూరులో నిర్మించిన సచివాలయ నూతన భవనం

కంకిపాడు: ప్రజలకు మెరుగైన సేవలు అందించే లక్ష్యంగా వైఎస్సార్ సీపీ ప్రభుత్వం గ్రామ సచివాలయ వ్యవస్థను తీసుకువచ్చింది. జాతిపిత మహాత్మా గాంధీజీ కలలు గన్న గ్రామస్వరాజ్య స్థాపనకు ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోంది. ప్రభుత్వ సేవలు సకాలంలో త్వరితగతిన చేరేలా సచివాలయాలను అందుబాటులోకి తేవటంతో పాటు సిబ్బందిని నియమించి మెరుగైన సేవలు అందేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవటంతో ప్రజల్లో హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి.

69 సచివాలయాలు



పెనమలూరు నియోజకవర్గంలో సచివాలయాలకు సొంత భవనాలు సమకూరుతున్నాయి. నియోజకవర్గంలో పెనమలూరు, కంకిపాడు, ఉయ్యూరు మండలాలు, ఉయ్యూరు నగర పంచాయతీ, వైఎస్సార్ తాడిగడప మున్సిపాలిటీలు ఉన్నాయి. పెనమలూరు మండలంలో 11 సచివాలయాలు, తాడిగడప మున్సిపాలిటీలో 19 సచివాలయాలు ఉన్నాయి. కంకిపాడు మండలంలో 18 సచివాలయాలు, ఉయ్యూరు మండలంలో 11 సచివాలయాలు, నగర పంచాయతీలో 10 సచివాలయాలు ఉన్నాయి. ఉయ్యూరు నగర పంచాయతీలో ఉన్న 10 సచివాలయాలు అద్దె, ప్రభుత్వ భవనాల్లోనూ కొనసాగుతున్నాయి.

రూ.19.79 కోట్లు మంజూరు

నియోజకవర్గంలో 51 సచివాలయాలకు భవనాలు నిర్మించేందుకు రూ.19.79 కోట్ల నిధులు కేటాయించారు. పెనమలూరు(వైఎస్సార్ తాడిగడప మున్సిపాలిటీతో కలిపి) 26 సచివాలయాలకు భవనాలు మంజూరయ్యాయి. రూ.10.24 కోట్ల అంచనా వ్యయంతో నిర్మాణ పనులు చేపట్టగా 24 సచివాలయాలు పూర్తయ్యి ప్రజలకు అందుబాటులోకి వచ్చాయి. ఇంకా ఒక భవనం తుదిదశలో ఉండగా, మరొకటి పనులు ప్రారంభించాల్సి ఉంది. కంకిపాడు మండలంలో 14 సచివాలయాలకు భవనాలు మంజూరయ్యాయి. రూ.5.45 కోట్ల అంచనాతో పనులు చేపట్టగా ఎనిమిది భవనాలు నిర్మాణం పూర్తయ్యి ప్రజలకు సేవలు కూడా అందుతున్నాయి. మరో ఐదు భవనాలు వివిధ దశల్లో ఉండగా, ఒకటి పనులు ప్రారంభించాల్సి ఉంది. ఉయ్యూరు మండలంలో 11 సచివాలయాలకు భవనాలు మంజూరు కాగా రూ.4.10 కోట్లతో పనులు చేపట్టారు. ఎనిమిది భవనాలు అందుబాటులోకి వచ్చాయి. మరో మూడు వివిధ దశల్లో ఉన్నాయి.

స్థానికంగానే సేవలు..

సచివాలయాలు లేని రోజుల్లో ప్రతి చిన్న పనికీ మండల కేంద్రాలకు పరుగులు పెట్టే పరిస్థితి. కానీ ఈ వ్యవస్థ అందుబాటులోకి రావటంతో గ్రామాల్లో మెరుగైన సేవలు అందుతున్నాయి. ఆయా సచివాలయాల్లో 689 మంది సిబ్బంది నియమితులయ్యారు. ధ్రువీకరణ పత్రాలు, అన్ని రకాల పౌరసేవలు, సంక్షేమ పథకాల సమాచారం, లబ్ధి ద్వారా ఇప్పటి వరకూ 2 లక్షలకు పైగా సేవలు నియోజకవర్గ ప్రజలకు అందాయంటే అతిశయోక్తి కాదు. స్థానికంగానే ప్రభుత్వ పరమైన సేవలు అందటంతో ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

ఇంటి వద్దే సేవలు భేష్..



ఒకప్పుడు సర్టిఫికెట్ కావాలంటే మండల కేంద్రానికి వెళ్లాల్సి వచ్చేది. రోజులు తరబడి తిరగాల్సి వచ్చేది. కానీ ప్రస్తుతం ఆ పరిస్థితి లేదు. ఉన్న ఊర్లోనే సేవలు భేష్‌గా అందుతున్నాయి. వలంటీర్లు ఇంటికి వచ్చి అన్నీ చెబుతున్నారు. సచివాలయ సిబ్బంది పౌర సేవలపై అవగాహన కల్పించి, సద్వినియోగం చేసుకునేలా చూస్తున్నారు. సచివాలయ వ్యవస్థ ద్వారా సీఎం జగన్ ప్రజలకు ఎంతో మేలు చేశారు.

– పి.కుమారస్వామి, కంకిపాడు

ప్రజల సంక్షేమానికి దోహదం..



సచివాలయాలను ఏర్పాటుచేయటం ద్వారా ప్రజా సంక్షేమానికి ఎంతో దోహదపడుతున్నాయి. వివిధ రకాల ప్రభుత్వ శాఖలకు సంబంధించిన సిబ్బంది గ్రామాల్లో అందుబాటులో ఉంటున్నారు. ఆయా విభాగాల ద్వారా సేవలు సమర్థంగా అందుతున్నాయి. మెరుగైన సేవలు అందిస్తున్న ప్రభుత్వం ఇది. సమయం, నగదు ఖర్చు ఆదా అయ్యింది. సచివాలయాలతో అన్ని వర్గాలకు మేలు జరుగుతోంది.

– కలపాల వజ్రాలు, తెన్నేరు

సాంకేతికతలో మార్పులకు అనుగుణంగా విద్యనభ్యసించాలి



ఉంగుటూరు: సాంకేతిక రంగంలో వస్తున్న విప్లవాత్మకమైన మార్పులకు అనుగుణంగా విద్యార్థులు విద్యా బుద్ధులు నేర్చుకోవాలని ఆర్‌జీయూకేటీ(నూజివీడు) డైరెక్టర్ ఎం.చంద్రశేఖర్ పేర్కొన్నారు. ఉంగుటూరు మండలంలో తేలప్రోలులోని ఉషారామ ఇంజినీరింగ్ కళాశాల 16వ వార్షికోత్సవం గురువారం ఘనంగా నిర్వహించారు. ఇంజినీరింగ్ పూర్తి చేసిన వెంటనే ఉద్యోగాలు వచ్చే విధంగా తమ కళాశాలలో విద్యార్థులను తీర్చిదిద్దుతున్నామని కళాశాల డైరెక్టర్ రాజశేఖర్ తెలిపారు. ప్రిన్సిపాల్ జీవీకేఎస్వీ ప్రసాద్ కళాశాల వార్షిక నివేదికను చదివి వినిపించారు. కళాశాల అకాడమీ టాపర్స్‌గా నిలిచిన విద్యార్థులకు చైర్మన్ సుందర రాంబ్రహ్మం అతిథులతో కలిసి గోల్డ్, సిల్వర్ మెడల్స్‌తో సత్కరించారు. అనంతరం విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.

బాధిత కుటుంబానికి నారా భువనేశ్వరి పరామర్శ

పెనమలూరు: మాజీ సీఎం నారా చంద్రబాబునాయుడు సతీమణి భువనేశ్వరి కానూరులో గురువారం పర్యటించారు. గతేడాది సెప్టెంబర్ 10న చంద్రబాబు నాయుడు అరెస్ట్ అయిన సందర్భంగా స్థానిక టీడీపీ నాయకుడు వేమూరి పార్థసారథి గుండెపోటుతో మృతి చెందారు. దీంతో ఆయన కుటుంబ సభ్యులను భువనేశ్వరి పరామర్శించారు. వేమూరి పార్థసారథి గత ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ అభ్యర్థి కొలుసు పార్థసారథి ఓటమికి స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేశారు. ఆమె వెంట స్థానిక టీడీపీ నాయకులు ఉన్నారు.

రేపటి నుంచి ఎన్నికల ప్రచారానికి వంశీ శ్రీకారం



పార్టీ కార్యాలయంలో వంశీమోహన్

గన్నవరం: నియోజకవర్గంలో ఈ నెల 30వ తేదీ నుంచి వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ వల్లభనేని వంశీమోహన్ ఎన్నికల శంఖారావం పూరించనున్నారు. విజయవాడ రూరల్ మండలం ఎనికేపాడులో శనివారం ఉదయం 7 గంటలకు ఎన్నికల ప్రచారాన్ని ఆయన ప్రారంభించనున్నారు. అనంతరం ప్రసాదంపాడు, రామవరప్పాడులో ఎన్నికల ప్రచారం కొనసాగనుంది. ఈ మేరకు ఎన్నికల ప్రచార షెడ్యూల్‌ను సిద్ధం చేశారు. స్థానిక నియోజకవర్గ వైఎస్సార్ సీపీ కార్యాలయంలో గురువారం ఎన్నికల ప్రచారంపై వంశీమోహన్ గన్నవరం, బాపులపాడు మండల నాయకులతో సన్నాహక సమావేశం నిర్వహించారు. విజయవాడ రూరల్, ఉంగుటూరు మండల నాయకులతో శుక్రవారం సమావేశం కానున్నారు. అనంతరం ఎన్నికల ప్రచార కదన రంగంలోకి దిగనున్నారు.

హ్యాట్రిక్ కొట్టేందుకు సిద్ధం

శాసనసభ్యుడిగా 2014, 2019 ఎన్నికల్లో వరుసగా విజయం సాధించిన వంశీమోహన్ 2024 ఎన్నికల్లో కూడా విజయం సాధించి హ్యాట్రిక్ కొట్టేందుకు సిద్ధమవుతున్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలతో పాటు గత 18 ఏళ్లుగా వ్యక్తిగతంగా చేసిన సేవా కార్యక్రమాలు ద్వారా వంశీమోహన్ నియోజకవర్గ ప్రజల మన్నలు పొందారు. ముఖ్యంగా కోవిడ్ విపత్కర సమయంలో ప్రజలకు అందుబాటులో ఉంటూ సత్వర వైద్య సేవలు అందించడంతో పాటు ప్రాణవాయువైన ఆక్సిజన్‌ను సరఫరా చేశారు. అత్యధికంగా నియోజకవర్గంలో 27 వేల పేద కుటుంబాలకు ఇళ్ల స్థలాలను వంశీమోహన్ పంపిణీ చేశారు. ఈ నేపథ్యంలో 2024 ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా ఎన్నికల కురుక్షేత్రంలోకి ఆయన దిగుతున్నారు. గత 58 నెలలుగా ప్రభుత్వం పెద్ద ఎత్తున్న అమలు చేసిన సంక్షేమ ఫలాల ద్వారా ప్రజలు పొందిన లబ్ధిని వివరిస్తూ ఎన్నికల ప్రచారంలో ముందుకు సాగనున్నారు. ఎన్నికల ప్రచారానికి అవసరమైన అన్ని ఏర్పాట్లను పార్టీ మండల కమిటీలు సన్నాహాలు చేస్తున్నారు.

నిడమానూరులో ఎమ్మెల్యే వంశీమోహన్ పర్యటన



పార్టీ నాయకులతో ఎమ్మెల్యే వంశీమోహన్

రామవరప్పాడు: వైఎస్సార్ సీపీ గన్నవరం నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ వల్లభనేని వంశీమోహన్ గురువారం విజయవాడ రూరల్ మండలం నిడమానూరులో పర్యటించారు. ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన గ్రామ మాజీ సర్పంచ్ పరిమి రమేష్ కుటుంబ సభ్యులతో పాటు ఆయన కుమారుడు పరిమి వంశీను పరామర్శించారు. ఈ నెల 30 నుంచి ఏప్రిల్ 10వ తేదీ వరకు విజయవాడ రూరల్ మండలంలో ఎన్నికల ప్రచార కార్యక్రమం నిర్వహిస్తుండటంతో పార్టీ నాయకులు, కార్యకర్తలతో చర్చించారు. ఈ నెల 30న ఎనికేపాడు కాల్వగట్టు ప్రాంతంలో ప్రచారం ప్రారంభించి ప్రసాదంపాడు, రామవరప్పాడు కాల్వగట్టు ప్రాంతాల మీదుగా మూడు రోజుల పాటు ప్రచారం నిర్వహిస్తున్నట్లు పార్టీ నాయకులు తెలిపారు. కార్యక్రమంలో గొల్లపూడి మార్కెట్ యార్డ్ మాజీ చైర్మన్ కొమ్మా కోటేశ్వరరావు, ఎంపీటీసీ, వార్డు సభ్యులు, నాయకులు పాల్గొన్నారు.

దావులూరు టోల్‌గేట్ వద్ద తనిఖీలు



తనిఖీలు నిర్వహిస్తున్న సీఐ శ్రీనివాసరావు, ఎస్‌ఐ సందీప్, సిబ్బంది

కంకిపాడు: ఎన్నికల ప్రవర్తనా నియమావళిని ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవని కంకిపాడు సీఐ వీ.శ్రీనివాసరావు స్పష్టంచేశారు. విజయవాడ–మచిలీపట్నం జాతీయ రహదారిపై దావులూరు టోల్‌గేట్ వద్ద కేంద్ర బలగాలు, ఎన్నికల ప్రత్యేక బృందంతో కలిసి పోలీసులు గురువారం వాహన తనిఖీలు చేపట్టారు. ఎస్‌ఐ డి.సందీప్‌తో కలిసి విజయవాడ–మచిలీపట్నం రోడ్డు మార్గంలో ప్రయాణిస్తున్న పలు వాహనాలను తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. వాహనదారుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళిని పకడ్బందీగా అమలు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని స్పష్టం చేశారు. తనిఖీల్లో ఎన్నికల ప్రత్యేక బృందం, కేంద్ర బలగాలు పాల్గొన్నాయి.

నారా భువనేశ్వరి తీరుపై జనసేన సమన్వయకర్త ఫైర్

హనుమాన్‌జంక్షన్‌రూరల్: జనసేన అధినేత పవన్‌కల్యాణ్ త్యాగానికి, జనసైనికుల కష్టానికి తెలుగుదేశం పార్టీ సరైన గౌరవం, గుర్తింపు ఇవ్వటం లేదని ఆ పార్టీ గన్నవరం నియోజకవర్గ సమన్వయకర్త చలమలశెట్టి రమేష్‌బాబు ఆవేదన వ్యక్తం చేశారు. నిజం గెలవాలి యాత్రలో భాగంగా రెండు రోజుల క్రితం హనుమాన్‌జంక్షన్‌లో పర్యటించిన నారా భువనేశ్వరి వ్యవహారశైలిపై తీవ్ర మనస్తాపం చెందిన చలమలశెట్టి సోషల్‌మీడియా వేదికగా తన ఆవేదనను వ్యక్తం చేశారు. తాజాగా గన్నవరం నియోజకవర్గంలో ఈ వీడియో వైరల్‌గా మారింది. నారా భువనేశ్వరి ప్రసంగం ఆద్యంతం చంద్రబాబు, లోకేష్‌ల గురించి పొగడ్తలు తప్పించి, కనీసం పవన్‌కల్యాణ్ మాటే ఎత్తలేదని చలమలశెట్టి ఆవేదన వ్యక్తం చేశారు. సభా ప్రాంగణంలో జనసైనికులు పవన్‌కల్యాణ్ గురించి చెప్పాలంటూ కేకలు వేసినప్పటికీ ఆమె ఏమాత్రం పట్టించుకోకపోవటం దురదృష్టకరమన్నారు. జనసైనికుల మనోభావాలను చంపుకుని, తెలుగుదేశం పార్టీ అడుగులకు మడుగులు ఎత్తాల్సిన అవసరం ఏ కోశాన లేదని తేల్చి చెప్పారు. జనసైనికులు తెలుగుదేశం పార్టీకి పాలేరు పని చేయటానికి సిద్ధంగా లేరని, అవమానాలు ఎదుర్కొంటూ మనసు చంపుకుని పని చేయలేమని చలమలశెట్టి వాపోయారు. సముచిత గౌరవ మర్యాదలు జనసైనికులకు ఇవ్వనిపక్షంలో టీడీపీ మీటింగులకు తమను పిలవద్దని ఘంటాపథంగా హెచ్చరించారు.

బంగారం చోరీపై కేసు నమోదు

పెనమలూరు: బంగారు ఆభరణాలు చోరీ ఘటనపై పోలీసులకు ఫిర్యాదు అందటంతో గురువారం కేసు నమోదు చేశారు. పెనమలూరు సీఐ టీవీవీ రామారావు తెలిపిన వివరాల ప్రకారం గంగూరుకు చెందిన మద్దుల బేబీసరోజిని మనవడు గంగూరులో చదువుతున్నాడు. రెండు రోజుల క్రితం ఇద్దరు కలిసి ఆటోలో తాడిగడప 100 అడుగుల రోడ్డులో మనమరాలు చదువుతున్న కార్పొరేట్ కాలేజీకి వెళ్లారు. ఆమె బ్యాగ్ ఆటోలో ఉంచి మనమరాలిని ఆటోలో ఎక్కించుకొని గంగూరుకు చేరుకున్నారు. ఆటో కిరాయి ఇద్దామని బ్యాగ్ తెరిచి చూడగా బ్యాగ్‌లో పర్సుతో పాటు నాలుగున్నర కాసుల బంగారు ఆభరణాలు కనబడలేదు. ఈ ఘటనపై బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేయటంతో కేసు నమోదు చేశారు.

వాహనదారులు ట్రాఫిక్ రూల్స్ పాటించాలి



వాహనదారులకు సూచనలు ఇస్తున్న ట్రాఫిక్ సీఐ పెద్దిరాజు

గన్నవరం: రోడ్డు ప్రమాదాలను నివారించేందుకు వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలను కచ్చితంగా పాటించాలని గన్నవరం ట్రాఫిక్ సీఐ వాసా పెద్దిరాజు సూచించారు. స్థానిక గాంధీబొమ్మ సెంటర్‌లో గురువారం ట్రాఫిక్ నిబంధనలపై వాహనదారులకు అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ట్రాఫిక్ సీఐ మాట్లాడుతూ.. డ్రైవింగ్ లైసెన్స్ లేని మైనర్లు అతివేగంగా వాహనాలు నడపడం వల్ల ఎక్కువగా ప్రమాదాలు జరుగుతున్నాయని చెప్పారు. ఈ ప్రమాదాల నివారణ కోసం మైనర్ పిల్లలకు వాహనాలు ఇవ్వకుండా తల్లిదండ్రులు జాగ్రత్త వహించాలని తెలిపారు. మైనర్లు మోటర్ సైకిళ్లు నడిపితే సదరు వాహనాలను స్వాధీనం చేసుకుంటామన్నారు. మైనర్ల సంరక్షకులపై చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని చెప్పారు. 18 ఏళ్ల నిండిన ప్రతి ఒక్కరూ డ్రైవింగ్ లైసెన్స్ తీసుకోవడానికి అర్హులుగా పేర్కొన్నారు. రోడ్డు ప్రమాదాలు జరిగినప్పుడు ప్రాణాలను కాపాడుకునేందుకు తప్పనిసారిగా హెల్మెట్లను ధరించాలని సూచించారు. ట్రాఫిక్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజా ప్రభుత్వాన్ని ఆశీర్వదించండి

రాష్ట్ర గృహ నిర్మాణశాఖ మంత్రి జోగి రమేష్



ఫ్యాన్ గుర్తుకు ఓటేయాలని వృద్ధురాలిని కోరుతున్న మంత్రి జోగి రమేష్

ఉయ్యూరు: ప్రజా ప్రభుత్వాన్ని మళ్లీ ఆశీర్వదించి జగనన్నను ముఖ్యమంత్రిని చేయాలని రాష్ట్ర గృహ నిర్మాణశాఖ మంత్రి జోగి రమేష్ కోరారు. మండలంలోని కాటూరు గ్రామంలో ఇంటింటి ప్రచారం గురువారం కూడా కొనసాగింది. మంత్రి జోగి రమేష్ మాట్లాడుతూ ఎస్సీ, బీసీ కాలనీల్లో పర్యటిస్తూ మంచి చేసిన సీఎం వైఎస్ జగన్‌కు అండగా నిలవాలని కోరారు. ఫ్యాన్ గుర్తుకు రెండు ఓట్లు వేసి ఆశీర్వదించాలని కోరారు. వృద్ధులు, రైతులతో ఆప్యాయంగా మాట్లాడి ప్రభుత్వం చేసిన మంచిని వివరించి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. స్థానికంగా సమస్యలను అడిగి తెలుసుకుని పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

రాజకీయాలకు అతీతంగా సంక్షేమం

జగనన్న ప్రభుత్వం వస్తేనే ప్రజలకు రాజకీయాలకు అతీతంగా సంక్షేమం అందుతుందని మంత్రి జోగి రమేష్ తెలిపారు. ప్రతిపక్షాల మాటలను నమ్మకుండా వైఎస్సార్ సీపీకి వెన్నుదన్నుగా నిలిచి సంక్షేమ ప్రభుత్వాన్ని తెచ్చుకోవాలని కోరారు. మంత్రి పర్యటనలో ఎంపీపీ చీలి కల్పన, మండల పార్టీ అధ్యక్షుడు దాసే రవి, సర్పంచ్‌లు పొనుగుమాటి బాలస్వామి, తుమ్మూరు సురేష్‌రెడ్డి, కోఆప్షన్ సభ్యురాలు బందెల జ్యోతి, నాయకులు ఆరేపల్లి రజనీకాంత్, కాటూరు కిషోర్, బందెల పాల్, కొండూరి ఆనంద్, కొడాలి నాగయ్య, తోట శ్రీనివాసరావు, కొడాలి అభి, బందెల చిన్ను, బందెల మధు, చీలి జనార్దన్‌రావు, తవిడి డానియేలు తదితరులు పాల్గొన్నారు.

నీటి సమస్యను పరిష్కరించాలని వినతి



నీటి సమస్యను తెలుసుకుంటున్న మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వరరావు

పెనమలూరు: తాడిగడప మున్సిపాలిటీ పరిధిలో పలు ప్రాంతాల్లో మంచినీటి సమస్యపై స్థానికులు కమిషనర్ వెంకటేశ్వరరావుకు ఫిర్యాదు చేశారు. దీంతో యనమలకుదురులో గురువారం పర్యటించిన కమిషనర్‌కు ఇందిరానగర్, ప్రియదర్శిని నగర్, తాడిగడప వసంతనగర్‌కట్ట, శ్రీనివాసా నగర్ కట్ట వాసులు నీటి సమస్యను వివరించారు. నీటి సమస్య ఉన్న ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి సారించి వెంటనే సమస్య పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. పని చేయని మోటర్లకు మరమ్మతులు చేయాలన్నారు. సమస్యలపై మున్సిపాలిటీ సిబ్బంది వెంటనే స్పందించాలని చెప్పారు. వాటర్ వర్క్స్‌కు సంబంధించి సిబ్బంది నిర్లక్ష్యం చూపితే చర్యలు తప్పవన్నారు. కార్యక్రమంలో డీఈలు రవికుమార్, రాజారావు, ఏఈ చంద్రశేఖర్, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రసాదంపాడులో మజ్జిగ పంపిణీ



మజ్జిగ అందజేస్తున్న ట్రాఫిక్ సీఐ రాజేంద్ర

రామవరప్పాడు: విజయవాడ రూరల్ మండలం ప్రసాదంపాడులోని అన్నపూర్ణ ట్రస్ట్ ఆధ్వర్యంలో గురువారం బెంజిసర్కిల్‌లో బాటసారులు, ప్రయాణికులకు ఉచితంగా మజ్జిగను పంపిణీ చేశారు. ట్రాఫిక్ సీఐ రాజేంద్ర ఈ శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా రాజేంద్ర మాట్లాడుతూ అన్నపూర్ణ ట్రస్ట్ ఆధ్వర్యంలో పలు సేవా కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. పేదల ఆకలి తీర్చడం, దుస్తులు పంపిణీ వంటి కార్యక్రమాలను దిగ్విజయంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ట్రస్ట్ నిర్వాహకురాలు జ్యోతి, ట్రాఫిక్ కానిస్టేబుళ్లు పాల్గొన్నారు.

పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం



ముస్తాబాదలో వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న ఆరోగ్య సిబ్బంది

గన్నవరంరూరల్: పౌష్టికాహారం తీసుకోవడం ద్వారా సంపూర్ణ ఆరోగ్యంగా ఉండవచ్చని మండల వైద్యాధికారి పి.శ్రీహర్ష తెలిపారు. మండలంలోని ముస్తాబాదలో గురువారం మండల వైద్యాధికారి ఆధ్వర్యంలో 104 వాహన వైద్య సేవలు అందించారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో అందిస్తున్న నాణ్యమైన వైద్య సేవలను రోగులు వినియోగించుకోవాలని ఆయన సూచించారు. దీర్ఘకాల రోగాలైన షుగర్, బీపీ పేషంట్లకు అవగాహన కల్పించారు. ఒత్తిడికి దూరంగా ఉండాలని, క్రమం తప్పకుండా వ్యాయామం చేయాలని సూచించారు. 172 మందికి పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. 104 వాహన వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.

వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు | వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు | శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు

అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.

పెనమలూరు డివిజన్
90105 77706 (ఉయ్యూరు)
99122 20539 (పెనమలూరు)
90102 10382 (గన్నవరం)
Office mail : sakshiads@gmail.com